# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

బుధవారం 12 జూన్ 2024


# వైభవంగా ప్రారంభమైన కొత్త కోడూరు గంగమ్మ జాతర

**రైల్వేకోడూరు, జూన్ 11, ప్రభాతవార్త:**

రైల్వేకోడూరు పట్టణంలోని వెలసి ఉన్న గంగమ్మ దేవాలయం వద్ద కొత్త కోడూరు గంగమ్మ జాతర కార్యక్రమం ఏడాది ఘనంగా నిర్వహించేందుకు గ్రామ కమాటీ సభ్యులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు కొత్త కోడూరు గంగమ్మ జాతర కోడూరు గంగమ్మ జాతర మాధురి అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు.కోడూరు పట్టణంలో ప్రధాన రహదరి నుండి కొత్త కోడూరు వరకు భారీగా విద్యుత్ దీపాలంకరణ చేశారు.కొత్తకోట గంగమ్మ ఆలయాన్ని విద్యుత్ దీపాలతో వైభవం అలంకరించారు కొత్త కోడూరు లో ప్రతి వీధికి విద్యుత్ దీపాలంకరణ చేశారు భారీ కటౌట్లు భారీ స్వాగత తోరణాలు చేశారు.12 తేదీ పల్లకి సేవ 13 గంగమ్మ జాతర 14 గంగమ్మ జలాధజవాసం కార్యక్రమంవ ముమ్మరంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తున్నారు ఇప్పటికే గ్రామ దున్నపోతును బట్టి ఘటం కుండా ఇంటింటికి తిరుగుతోంది స్థానికులు గ్రామ దున్నపోతుకు ఘటం కొండకు ప్రత్యేక పూజలు నిర్వహించి జాతర ఏర్పాట్లు చేస్తున్నారు

తిరుగుతోంది గంగమ్మ తల్లి ఊరేగింపుగా బయలుదేరే అంకాలమ్మ దేవస్థానం వద్ద ఈ ఏడాది పది అడుగుల భారీ అంకాలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు గంగమ్మ జాతరకు భారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.












# హై రిస్క్ గర్భిణీ స్త్రీలను గుర్తించండి మాతృ మరణాలు నివారించండి

డాక్టర్ నాగ శశి భూషణ్ రెడ్డి డి.పి.ఎం.ఓ కడప





**బద్వేల్, జూన్ 11, ప్రభాతవార్త:**

11/06/2024 వ తేదీన ఈరోజు బద్వేల్ మున్సిపాలిటీ కార్యాలయం నందు ఆశ సమావేశం జరిగిమైనది. ఈ కార్యక్రమంలో బద్వేల్ మండలము తొట్టిగారి పల్లె, సురేంద్ర నగర్, కోటవీధి పట్టణ ప్రాథమిక మెడికల్ ఆఫీసర్స్ ఏ.ఎన్.ఎం లు, ఆశాలు కార్యకర్తలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సమావవేశపరిచి, డాక్టర్ శశిభూషన్ రెడ్డి మాట్లాడుతూ పూనరుత్పత్తి, చైల్డ్ హెల్త్ ప్రోగ్రాం భాగంలో గర్భిణీ స్త్రీలను చిన్న పిల్లలను వారి సేవలను అప్డేట్ చేయవలసినదిగా పేర్కొనడమెనది. ఈ ఆశ యాప్, ఏఎన్ఎం యాప్ సిహెచ్ఓ యాప్, ప్రతిరోజు ఓపెన్ చేసి గర్భిణీ స్త్రీలనుచిన్న పిల్లలను, రక్త పరీక్షలు చేయించి, రక్తహీనత లేకుండా చూడవలసిన బాధ్యత ఎంతైనా ఉన్నది. గర్భిణీ స్త్రీలు అందరికీ సరైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సేవలు అందించి, మరియు ముఖ్యంగా కష్టతరమైనటువంటి గర్భిణీ స్త్రీలను గుర్తించి 102,108 వాహనము ఉపయోగించుకొని, సరైన సమయంలో, సరైన చికిత్సను అందించవలసినదిగా మెడికల్ ఆఫీసర్స్ కు ఆదేశించడమైనది, ఈ కార్యక్రమంలో జిల్లా స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ హెల్త్ మేనేజ్మెంట్ ఇన్ఫర్మేషన్‌లో గర్భిణీ స్త్రీలను బాలింతలను చిన్నపిల్లలను, హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించి ఆన్లైన్ లో నమోదు చేయవలసినదిగా ఆవశ్యకత ఎంత అయినదని పేర్కొనడమైనది, అరుణకుమారి జిల్లా పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలకు బాలింతలకు యుక్త వయస్సు పిల్లలందరికి కూడా అనీమియా ముక్తభారత్ కింద ఐరన్ టాబ్లెట్స్ క్యాల్షియం మాత్రలు ఇచ్చి రక్తం హీనతను నివారించవలసిన ఆవశ్యకత ఎంత అయినదని పేర్కొనడమైనది, నారాయణ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ మాట్లాడుతూ, రీప్రొడెక్టీవ్ అండ్ చైల్డ్ హెల్త్ మరియు అన్మోల్ లో కచ్చితంగా గర్భిణీ స్త్రీలను చిన్నపిల్లలను బాలింతలను నమోదు చేసి వారికి సేవలు అందించి, ఆన్లైన్‌లో అప్డేటన చేయవలసిందిగా కోరడమైనది. వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి సలహాలు సూచనలు ఇవ్వబం అయినదని, అనంతరం సురేం ద్ర నగర్ పట్నం ఆరోగ్య కేంద్ర పరిధిలోని వెంకటయ్య నగర్ నందు జిల్లాటాస్క్ ఫోర్స్ మీటింగ్ జరిపి గర్భిణీ స్త్రీలను చిన్నపిల్లలను రక్తహీనత ఉన్నటువంటి గర్భిణీ స్త్రీలను ప్రతి లబ్ధిదారులను ఎంక్వయిరీ చేసి సేవలను గురించి అరతీ యుడమైనది, సిబ్బందికి సరియైన సలహాలు సూచనలు ఇవ్వడం అయినది. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగ శశిభూషన్ రెడ్డి డిపిఎంఓ, జిల్లా స్టాటికల్ ఆఫీసర్, అరుణ కుమారి జిల్లా పబ్లిక్ నర్సు ఆఫీసర్ కే.నారాయ ణ, డిపిఎంయు హరినా థ్ డిప్యూటీ స్టేటస్ ఆఫీసర్ ప్రథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోష్ణ స్వర్ణలత డాక్టర్ జై వినయ్ కుమార్ పట్టణ ఆరోగ్య సైమ్య మరియు డాక్టర్ నరశీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్ బి.వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రావతి కే.వెంకటమ్మ హెల్త్ సుపర్వైజర్ విలేజి హెల్త్ క్లీనిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, ప్రథమిక ఆరోగ్య కేంద్రంసిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పొగాకు అమ్మకాలపై పట్టించుకోని అధికారులు

## – మామూళ్ళ మత్తులో...నిఘా అధికారులు

**రామసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త :**



గుట్కా, ఖైనీ తదితర పొగాకు ఉత్పత్తులు అమ్మరాదంటూ, ఆరోగ్యాన్ని దెబ్బతీసే వీటిపై ప్రభుత్వం నిషేదం విధించింది. కానీ రోడ్ల పక్కన టి దుకాణాల్లో, పాన్‌షాపుల్లో, డాబాల్లో, చిల్లర దుకాణాల్లో, ఆయిల్ స్టోర్స్‌ల్లో ప్యాకెట్లను బహిరంగానే అమ్ముతున్నారు. కొనుగోలుదారులు కొంటున్నారు. తినేవారు తింటున్నారు. ఇలా నిషేదాన్ని వెక్కిరింతగా మార్చేశారు. పైగా దానిపేరు చెప్పి ఒక్కో ప్యాకెట్‌పై రెండు నుండి నాలుగు రెట్లు అధిక ధరలు పెంచేశారు. వ్యాపారులు, అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలని వ్యాపారాలు అడ్డదారులు తొక్కుతున్నారు. పట్టణంలోని మూరుమూల వాడల్లో గుట్టుచప్పుడు కాకుండా గుట్కా నిల్వ ఉంచి అమ్ము కొంటున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీటికి కోడ్ బాషను ఉపయోగించుకొని దుకాణాల్లో కొంటున్నారు. జి అంటే గుట్కా, సి అంటే ఖైనీ, పి అంటే పాన్‌పరాగ్, ఎల్ అంట్ పెద్ద ఖైనీ పొగాకు ఇలా ఒకొక్క దానికి ఒకొక్క పేరు పెట్టి తీసుకొంటున్నారు. అప్పారావువీధి, త్యాగరాజవీధి, అప్పారావుతోటలో మరీ విపరీతంగా చిల్లర దుకాణాల్లో అమ్ముతున్నారు. మసీదువీధి, సంతబజారు, శాస్త్రీవీధి, సిపాయివీధి, దేవళంవీధి, ప్యారడైజ్ పంక్షన్‌హాలు వీధి, కొత్తపల్లి, ఈశ్వరమ్మకాలనీ, నీరుగట్టువారిపల్లె, శివాజినగర్ ఇలా పట్టణానికి మారుమూలగా ఉన్న ప్రాంతాల్లో అధికంగా అమ్ముతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గుట్కా ఆనవాలు లేకుండా చేయాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. గుట్కా వ్యవహరాలు సాగినా, సరఫరా చేసినా గుట్కాతయారీ కేంద్రాలను తయారవుతున్నట్లు బయటపడితే ఆయా పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలను బాద్యులుగా చేస్తామని ఉన్నతాధికారులు చెబుతు ప్రకటనలు ఇస్తున్నారు. అయితే టాస్క్‌పోర్స్, ఎస్ఓటి పోలీసులకు భారీ సంఖ్యలో గుట్కా విక్రయాలు పట్టుబడ్డా ఆయా పోలీస్‌స్టేషన్‌లో అంతంతమాత్రమే కేసులు పెడుతున్నారు. బాధితులు అంతంతమాత్రమే కేసులతో చట్టాలకు చుట్టాలై తప్పించుకొని మళ్ళీ యదావిధిగా అదే వ్యాపారంలో రెట్టింపు సంపాదిస్తున్నారు. దీంతో నిషేధిత గుట్కా విక్రయాలపై స్థానికంగా ఉండే పోలీసులు చూసీచూడనట్లుగా వ్యవహరించడంతో పాటు కొందరు మరో అడుగు ముందుకేసి మామూళ్ళు తీసుకొంటున్నారని విమర్శలు ఉన్నాయి. కొన్నాళ్ళు పాటు గౌడౌన్లను పట్టణంలో నిర్వహించినా ఇప్పుడు కాస్త శివారు ప్రాంతాలకు తరలించారు. గుట్కాలను ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి శివార్లలోని గౌడౌన్లలో నిల్వ చేస్తున్నారు. గౌడౌన్లలో స్టోర్ చేసిన గుట్కాలను చిన్న చిన్న ఆటోల్లో పట్టణంలోకి తరలిస్తున్నారు. ఒకవేళ పోలీసులకు చిక్కితే గౌడౌన్ సమాచారం తెలియనీయకుండా జాగ్రత్తలు తీసుకొంటున్నారు. ఆటొల్లో, కార్లల్లో, టూవీలర్స్‌లో కవర్లు, సంచుల్లో గుట్కాలను పెట్టుకొని తమ కష్టమర్లకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి వ్యాపారులకు చిన్న, పెద్దా అన్న తేడా లేకుండా షోల్డర్ బ్యాగుల్లో వేసుకొని కావాల్సిన దుకాణాలకు రవాణా రూపంలో చేర్చుతున్నారు. పట్టణంలోని ఆయా పాన్‌షాపులకు, కిరాణ దుకాణాలకు నేరుగా సరఫరా అవుతొంది. ప్రజా ఆరోగ్యానికి హానికరంగా మారిన నిషేదిత గుట్కా, ఖైనీ విక్రయాలపై ఉక్కుపాదం మెపాలని ప్రజలు కోరుతున్నారు.

# కేంద్ర మంత్రివర్గ కూర్పులో రాష్టానికి అన్యాయం

**వేంపల్లె, జూన్ 11, ప్రభాతవార్త :**

కేంద్రమంత్రివర్గ కూర్పులో రాష్ట్రానికి అన్యాయంతో పాటు తెలుగుదేశం పార్టీని చిన్నచూపు చూశారని రాష్ట్ర కాంగ్రెస్ మీడియా ఛైర్మన్ ఎన్.తులసి రెడ్డి అన్నారు. మంగళవారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. 29మంది ఎంపీలున్న మధ్య ప్రదేశ్‌కు ఐదు మంత్రి పదవులు, 26మంది ఎంపీలు న్న గుజరాత్‌కు ఐదు, 25మంది ఎంపీలున్న రాజస్థా న్‌కు 5 మంత్రి పదవులు దక్కగా 25మంది ఎంపీలు న్న ఏపీకి 3మంత్రి పదవులు మాత్రమే దక్కడం శోచనీయం అన్నారు. ఈ విధంగా రాష్ట్రానికి అన్యా యం జరిగిందన్నారు. ఇక రాష్ట్రానికి ప్రత్యేకహోదా, విభజన చట్టంలోని అంశాలను ఏ విధంగా సాధిస్తారో చూడాల్సి ఉందని ఆయన అన్నారు.



చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే రాంప్రసాద్‌రెడ్డి, కుమారుడు నాగిరెడ్డి

## విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి

ఫ్రిడ్జికు విద్యుత్ సరఫరా కావడంతో ఈ ప్రమదం

గ్రామంలో ఆలుముకున్న విషాద చాయలు

ఒంటిమిట్ట, జూన్11, ప్రబాతవార్త:



మండలంలోని ఇబ్రహీంపేట గ్రామంలోని ఒక ఇంటిలో ఫ్రిడ్జికు విద్యుత్ సరాఫరా కావడంతో ఇద్దరు మృతి చెందారు. ఈ గ్రామానికి చెందిన కోనేటి గంగమ్మ(63) అనే వృద్దురాలు తన ఇంటిలోని ఫ్రిడ్జిను తెరవగావిద్యుత్ షాక తగలడంతో గట్టి గా కేకలు వేసింది. ఇంటి బయట వెళుతున్న పేరూరు కోండయ్య గంగమ్మను కాపాడేందుకు ప్రయత్నించగా తనకు కూడా విద్యుత్ షాక్ తగిలింది. దీంతో గంగమ్మ అక్కడక్కడే మృతి చెందింది. కోండయ్యను చికిత్స కోసం ఒంటిమిట్ట ఆసుపత్రకి తరలించారు. కానీ అప్పటికే కోండయ్య(58) మృతి చెందినట్లు ఆసుపత్రి సిబ్బంది తెలిపారు.ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు విద్యుత్‌షాక్ గురికావడంతో గ్రామంలో విషాద చాయలు ఆలుముకున్నయి. ఫ్రిడ్జికు విద్యుత్ సరఫరా ఎలా వచ్చిందో తెలియాల్సి వుంది.

### పాడి పశువులకు గొంతు వాపు వ్యాధి రాకుండా

## నివారణ చర్యలు చేపట్టాలి




వీరబల్లి,జూన్11, ప్రభాతవార్త :

మండలంలో ఉన్న పాడి పశువుల రైతులు మరియు మేకల,గొర్ల రైతులు గొంతు వాపు వ్యాధి మరియు చిటిక వ్యాధులు రాకుండా నివారణ చర్యలు చేపట్టాలని పశువైద్య సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ మాలకొండయ్య తెలిపారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలో పశువైద్యశాలలో వైద్య సిబ్బందికి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పశువులకు మేకలకు గొర్లకు చిటిక వ్యాధి మరియు గొంతువాపు వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలుగా వ్యాక్సిన్ వేయాలని చెప్పారు. ఇప్పటికే చిటిక వ్యాధి రాకుండా వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. మండలంలో రెండు వేలకు పైగా గొంతువాపు వ్యాధి రాకుండా నివారణకు టీకాలు వేసినట్లుఆయన చెప్పారు. ఇంకా గ్రామాలలో ఎవరైనా రైతులు తమ పశువులకు టీకాలు వాడకుండా ఉంటే వెంటనే వారికి వ్యాధుల గురించి తెలియపరచి టీకాలు వేయాలని సిబ్బందికి సూచించారు. ఎక్కువగా ఈ వ్యాధులు గేదెలలో వస్తాయని ఈ వ్యాధి వస్తే పశువులు మేయకుండా గొంతు వాపు వచ్చి వెంటనే చనిపోవడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాధి గురించి రైతులకు గ్రామాలలో అవగాహన కల్పించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమమంలో మండల పశువైద్యాధికారి నాగరాజు, వి.ఎల్‌ఓ జయప్రకాశ్, రాజేంద్ర, మండల వైద్య సిబ్బంది పాడి రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన సమ్మర్ క్యాంప్



కమలాపురం, జూన్ 11, ప్రభాతవార్త:

దాదాపు 20 రోజుల నుంచి ఇస్కాన్ వారి ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ భగవద్గీత శ్లోక పఠనం కార్యక్రమం స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో జరుగుతున్నది. అందులో భాగంగా మంగళవారం చివరి రోజు పిల్లలకు సర్టిఫికెట్లు, భగవద్గీత, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు కామిశెట్టి రమణయ్యను, మాజీ అధ్యక్షులు భూపాలం సుబ్బారావును సత్కరించారు. అలాగే ఇంతటి కార్యక్రమాన్ని దిగ్విజయం చేసినందుకు కృషి చేసిన భూపాలం శివరామకృష్ణను, భూపాలం హరిభాస్కర్‌ను సంఘసభ్యులు సత్కరించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో రెడ్డి సురేష్, బచ్చు సుబ్రమణ్యం, భోజనపాటి సుధాకర్, చక్రవర్తి, కిశోర్ తదితర ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ఐటీ ఎంబీఏ విద్యార్థుల ప్రతిభ

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 11, ప్రభాతవార్త:




జేఎన్‌టీయూఏ అనంతపురం వారు ఎంబీఏ సెకెండియర్ 4వ సెమిస్టర్ వారికి ఏప్రిల్, మే-2024లో నిర్వహించిన పరీక్ష ఫలితాలలో సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విద్యార్థులు తస్లీం ఖానమ్ 89%, ధరణి 85.25%, కృష్ణచైతన్య 84.5%, అశ్రిత 84.25%, యశ్వంత్ 84%, ఆయేషా తబస్సమ్ 84% మూర్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచారని ప్రిన్సిపల్ డా.పాండురంగన్ రవి సగర్వంగా తెలిపారు. ఈ సందర్భంగా పరీక్షా ఫలితాలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఛైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీర కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీర కల్యాణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా.ఎ.వెంకటేశ్వరరెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ షబానాబి, అధ్యాపకులు అభినందించారు.

## కృష్ణా బ్యారేజీలో దూకి ప్రొద్దుటూరు వాసి ఆత్మహత్య

ప్రొద్దుటూరు క్రైం, జూన్ 11, ప్రభాతవార్త:



ప్రొద్దుటూరు ఆర్యవైశ్య కులానికి చెందిన సుబ్బారావు అనే వ్యక్తి విజయవాడలోని కృష్ణా బ్యారేజీలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఒక నాయకుడికి రూ.12 కోట్ల వరకు అప్పులు ఇప్పించాడని సమాచారం. అంతే కాకుండా భారీగా వైసీపీ గెలుపుపై పందాలు పెట్టినట్లు తెలుస్తోంది. మున్సిపాలిటీలో సబ్ కాంట్రాక్టర్‌గా పనులు చేశాడని చెబుతున్నారు. తన ఆత్మహత్యకు కారణాలు సూసైడ్ నోట్‌లో రాసినట్లు పోలీసులు చెబుతున్నారు. అందులో కొందరి ప్రముఖుల పేర్లు ఉన్నట్లు తెలుస్తోంది. ఇంకా ఎంత మంది బలికాబడతారో అని పలువురు చర్చించుకుంటున్నారు.

## శ్రీవారినగర్‌లో నెలరోజులుగా నీటి ఎద్దడి

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని అనపగుట్ట వద్ద ఉన్న శ్రీవారినగర్‌లో నెలరోజులుగా తీవ్ర నీటిఎద్దడి నెలకొంది. బోరు మరమ్మత్తులకు గురై నెల రోజులు అవుతున్నా మున్సిపల్ ఇంజనీరింగ్‌శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో శ్రీవారినగర్ వాసులు నీటిసమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయించి రూ.500లతో ట్యాంకు నీటిని కొనుగోలు చేసుకొంటున్నారు. నిరుపేదలు నివసించే ఈ ప్రాంతంలో నెలరోజులుగా మున్సిపల్ బోరు నుంచి నీటిసరఫరా లేకపోవడంతో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 15రోజుల మరమ్మత్తులకు గురైన బోరునుంచి మెటారును వెలికితీశారు తప్పా ఇంతవరకు మోటరు అమర్చకపోవడంతో నీటిసమస్యతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. శ్రీవారి నగర్ వాసులు నీటి సమస్యపై మున్సిపల్ కమీషనర్‌కు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోతోంది. మున్సిపల్ ఇంజనీరింగ్‌శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే నీటిసమస్య జఠిలం అవుతుందని పలువురు చెబుతున్నారు. నీటిసమస్యపై ఫిర్యాదులు వస్తున్నా వారి సకాలంలో స్పందించడం లేదంటూ పలువురుచెబుతున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి శ్రీవారినగర్‌లో బోరు మరమ్మత్తుపనులు చేపట్టి వెంటనే నీటిసమస్యను తీర్చాలంటూ పలువురు కోరుతున్నారు.

## గాలివీటి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పణ

గాలివీడు, జూన్ 11(ప్రభాతవార్త):



మండల కేంద్రంలోని కుషావతి నదీతీరాన వెలసిన శ్రీ గాలివీటి గంగమ్మకు వీరబల్లి వాస్తవ్యులు గాలివీటి కుటుంబీకులు పట్టువస్త్రాలు, పులివాహనం, ఉత్సవ గొడుగును మంగళవారం సాయంత్రం సమర్పించడం జరిగింది. ప్రతి సంవత్సరం సాంప్రదాయబద్ధంగా గాలివీటి గంగమ్మ జాతర సందర్భంగా పట్టువస్త్రాలు సమర్పించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా గాలివీటి విశ్వనాధరెడ్డి కుటుంబసభ్యులు గేటు దగ్గర నుంచి అమ్మవారి ఆలయం వరకు ఊరేగింపుగా వచ్చి పట్టువస్త్రాలు సమర్పించారు. జాతర 17, 18 తేదీలలో జరగనున్నది.

## ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయండి

- దాడులు ఆపాలని పిలుపు - ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

జమ్మలమడుగు, జూన్ 11, ప్రభాతవార్త:



ఎన్డీఏ కూటమిలో ఉన్న టీడీపీ, జనసేన రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని డిమాండ్ చేయమని వైసీపీ ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ బీజేపీకి దేశంలో అనుకున్న సీట్లు రాకపోవడంతో ఖచ్చితంగా కూటమిలో ఉన్న పార్టీలపై ఆధారపడాల్సి ఉంటుందన్నారు. ఇదే సమయంలో బీజేపీ తరువాత టీడీపీ అత్యధిక స్థానాలతో 2వ స్థానంలో ఉంది. కావునా రాష్ట్ర ప్రయోజనాల కోసం అభివృద్ధి కోసం, పరిశ్రమల కోసం ప్రత్యేక హోదా కోసం డిమాండ్ చేయాలన్నారు. టీడీపీ జనసేన బీజేపీల కూటమి అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్నందుకు అభినందనలు తెలిపారు. ఇకపోతే రాష్ట్రంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడడం సరికాదన్నారు. వెంటనే టీడీపీ, జనసేన శ్రేణులు దాడులను ఆపాలని కోరారు. పోలీసులకు కూడా లా అండ్ ఆర్డర్ సమస్య లేకుండా వ్యవహరించాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్ కోసం కృషి చేయాలన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగ అవకాశాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

### అబ్బో భలే ఉందే...

## 2, 1, 5రుపాయల నోట్లు అరుదే..










నిమ్మనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

రుపాయి నోటా..అబ్బో భలే ఉందే... చూడడానికే ఇది. చెలామణికి ఇస్తే ఆలోచనలో పడుతున్నారు. మారుతాయ...లేదా... చివరకి పడేయాలా అన్న మాట ఎలా ఉన్నా. ఇదేబాటలో రూ.2, 5నోట్లు కూడా కాలం చెల్లిందా అంటే లేదు.. నిమ్మనపల్లె మండలంలో మాత్రం ఈనోట్లు తీసుకెలితే ఆశ్చర్యంగా చూస్తున్నారు. అవి చెలామణిలో ఉన్నాయో లేదా..అంటూ కానీ అనధికారికంగా మాత్రం వ్యాపారస్థులు వీటిని చెల్లవంటూ కొందరు వెనక్కి ఇస్తున్నారు. రుపాయి...ఐదు రుపాయలు...రెండు రుపాయలు...నోట్లు ఎంత కొత్తగా ఉన్నా చూడడానికే తప్పా మార్పిడి పనికిరావంటున్నారు. దీన్ని బట్టీ చూస్తే వీటికి కాలం చెల్లిందా అన్ని అనుమానం వస్తొంది. రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మార్పిడి చేయరాదని చెప్పకపోయినా వ్యాపారులు ఇలా పుకార్లు చేస్తున్నారు. ఒకటి, రెండు, మూడు, ఐదు, ఇరవై, ఇరవై ఐదు పైసాలను నిషేధించింది. అయితే ఒకరుపాయి, రెండు రుపాయలు కాయిన్స్ చెందుతాయి. అదే ఒకటి, రెండు, ఐదు రూపాయల నోట్లు చెల్లవట ఇదేమి విడ్డూరమంటూ వినియోగదారులు అంటున్నారు. వీటిని సంతకు, బజారుకు, చిల్లరకొట్టుకు, టీ దుకాణంకు, కండెక్టర్‌కు ఇచ్చినా అనుమానంగా తీసుకోవడం, తీసుకోకపోవడం చేస్తున్నారు. అయితే వ్యాపారస్థులు మాత్రం ఈ నోట్లను తీసుకోకుండా వీటిని స్థానంలో ఉన్న నాణ్యలను మాత్రం తీసుకుంటున్నారు. ఈ నోట్లను ఏం చేయాలని ప్రజలు వాపోతున్నారు.

ఇప్పటికైనా అధికారులు ఇవి చెలామణిలో ఉన్నాయా.. లేదా.. అధికారికంగా ప్రకటిస్తే బాగుండునని తెలిపారు.

## జనం మెచ్చిన...జట్కా బండ్లు...

లక్..టక్..లక్...టక్ అంటూ జట్కాబండ్లు - తగ్గిన ఆదరణ - ఉపాధి కోల్పోయిన యజమానులు



మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

చల్..చల్ గుర్రం...చలాకి గుర్రం...అంటూ గత 40సంవత్సరాల క్రితం ప్రయాణీకులు ఎక్కడికైనా ప్రయాణించాలంటే జట్కా బండ్లపైనే ఆధారపడేవారు. ఏవైనా నిత్యవసర సరుకులు, వస్తువులు మార్చాలన్నా గుర్రపు బండ్లను పిలచేవారు. పట్టణంలో అధికంగా వీధి వీధిన లక్..టక్..లక్..టక్ అంటూ శబ్దాలతో తిరుగుతుండేవి. రాజుల కాలంలో గుర్రాలపైనే అధికంగా వెళ్ళేవారన్న విషయం అందరికి తెలిసిందే. ఇలాంటి జట్కాబండ్లపై పట్టణంలో వందలాది కుటుంబాలు జీవన పొందేవారు. ఇటీవల కాలంలో ఆటోలు, ద్విచక్రవాహనాలు, మూడుచక్రాల రిక్షాలు వంటి అధునాతనమైన వస్తువులతో తయారు చేసిన బండ్లు రావడంతో కాలక్రమేణా రానురాను జట్కా బండ్లకు ఆధరణ కరువైంది. జట్కాబండ్లకు మదనపల్లె ఎంతో ప్రసిద్ది చెంది ఉండేది. 40 ఏళ్ళ క్రితం వీటిలోనే ప్రయాణికులు అందరూ గమ్యస్థానాలకు చేరేవారు. బస్సు దిగగానే గుర్రపు జట్కా వైపు చూసేవారు. మదనపల్లె రోడ్లలో ఇవి వెలుతూ వచ్చే శబ్దాలను ఆసిక్తిగా వినేవారు. అప్పట్లో వీరికి ప్రతిరోజూ మంచి సంపాదన ఉండేది. ఉదయం నుండి రాత్రి వరకు బిజీగా వీటి నిర్వాహకులు ఉండేవారు. గతంలో 200 పైగా ఉన్న జట్కాబండ్లు ప్రస్తుతం 10లోపే ఉన్నాయి. ఇవి కూడా ప్రయాణికులు ఎక్కకపోవడం వల్ల ఖాళీగా ఉంచుకోవాల్సి వస్తోంది. చిత్తూరు బస్టాండు, పట్టుగూళ్ళ మార్కెట్ వద్ద ఈ గుర్రప జట్కాలు అప్పుడప్పుడు కనిపిస్తాయి. తరతరాలుగా వస్తున్న వంశపారంపర్యపు ఆచారాన్ని పొగొట్టుకోలేక కొందరు ఇప్పటికి జట్కాలపైనే ఆధారపడుతున్నారు. చిత్తూరు బస్టాండులో ఇప్పటికి ఇవి కనపడుతుంటాయి. ప్రయాణికులు ఎక్కడం మరవడంతో చిన్నపిల్లలు, పట్టుగూళ్ళు చిల్లర వస్తువులను తీసుకెలుతూ వారి ఇచ్చే పైకంతో కడుపు నింపుకొంటున్నారు. రోజుకు గుర్రానికి మాత్రమే రూ.300పైగా ఖర్చు అవుతుంది. పచ్చగడ్డి, గుగ్గిళ్ళు, తవుడు కోసం ఎక్కువుగానే ఖర్చు చేయాల్సి ఉంది. సంపాదించిన డబ్బుల్లో ఎక్కువ భాగం వీటి పోషణకే సరిపోవడం లేదు. నేటి ఆధునిక యుగంలో మునుపటి జట్కాబండ్లు కనుమరుగు అవుతుండడం జరుగుతుంది. ఏది ఏమైనప్పటికి జట్కాబండ్లతో కాలుష్య నివారణకూడా తగ్గేది. అలాంటి జట్కాబండ్లుకు ఆదరణ లేకపోవడంతో బతుకుజీవుడా అంటూ జట్కాయజమానులు గుర్రాలను మేపుకోలేక అల్లాడుతున్నారు. జట్కాబండ్ల నిర్వాహకులకు బ్యాంకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

## ఘనంగా ఇందిరాగాంధికి నివాళులు

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

పట్టణంలోని బెంగుళూరు బస్టాండులో దివంగతనేత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మంగళవారం ఇందిరాగాంధీ విగ్రహానికి నూతనంగా పెయింటింగ్ వేయించి గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బిజెపికి కళ్ళెం వేసి దేశాన్ని, రాజ్యాంగాన్ని కాపాడారన్నారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యేవరకు ప్రజలతోనే ఉంటామన్నారు. నేడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా, ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ నాయకులు డాక్టర్ ఎస్‌కె.బాషా,మీనాకుమారి, మహబూబ్‌బీ, ఈశ్వరమ్మ, అల్లాభక్షు, ఖాషీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

## వైభవంగా గంగమ్మ జాతర

రామసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త :



రామసముద్రం మండలంలోని కాప్పల్లె పంచాయితీ బైరాజుపల్లె గ్రామంలో వైభవంగా గంగజాతర మంగళవారం నిర్వహించారు. ఈ జాతర రెండు రోజులు పాటు నిర్వహించనున్నారు. గ్రామదేవతకు మహిళలు ఉపవాసాలతో దీపాలు, బోనాలు పెట్టి మొక్కులు తీర్చుకొన్నారు. గ్రామనంలోని గ్రామ దేవతను ఊరేగింపుకార్యక్రమం నిర్వహించారు. బైరాజుపల్లె గ్రామంలో స్థానికులు, భక్తులతో కిటకిటలాడింది. ప్రతి ఇంటిముందు రంగు రంగుల ముగ్గులు, పచ్చని తోరణాలతో అలంకరించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలతో అలంకరణలు చేసి అమ్మవారికి దీలు బోణాలు మోసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకొన్నారు. ఈ కార్యక్రమంలో క్షత్రియ పెద్దలు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## ట్రాన్స్‌జెంటర్ల హక్కులు అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం

కడప లీగల్, జూన్ 11, ప్రభాతవార్త:

కడప నందు ట్రాన్స్ జెండర్ల హక్కులు, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ కం, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబాఫక్రుద్దీన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగమార్పిడి వ్యక్తి అంటే పుట్టినప్పుడు ఆ వ్యక్తికి కేటాయించిన లింగంతో అతని లింగం సరిపోలని వ్యక్తి. లింగమార్పిడి వ్యక్తులు అంటే విభిన్న రూపాన్ని వ్యక్తిగత లక్షణాలు మరియు ప్రవర్తన కలిగి ఉంటారు. ఇతర లింగాల నుంచి విభిన్నంగా ఉండడం వలన లింగమార్పిడి వ్యకతులు సామాజిక అణచివేతకు గురవుతారు. ఎందుకంటే సమాజం వారి లింగ గుర్తింపును అంగీకరిస్తుంది మరియు వారి వారిపై విధించిన శారీరక హింసకు గురవుతారన్నారు. విద్య లేకపోవడం, నిరుద్యోగం, ఇల్లు లేకపోవడం తదితర వాటి వల్ల వారు బాధపడుతున్న ప్రధాన సమస్యలని వారి హక్కులను పరిరక్షించడానికి మరియు వారి సమస్యలను పరిష్కరించడానికి భారత రాజ్యాంగం వారికి స్వంత హక్కులను అందించిందన్నారు. సుప్రీం కోర్టు వారికి థర్డ్ జెండర్‌గా గుర్తించబడే హక్కును ఇచ్చిందని వారికి కొన్ని సంక్షేమ చర్యలను అందించిందన్నారు. దేశంలో లింగమార్పిడి వ్యక్తుల చట్టం, 2019 లింగమార్పిడి వ్యక్తుల హక్కులను పరిరక్షిస్తుందని మరియు వారి సంక్షేమం కోసం అందిస్తోందని వారసత్వపు హక్కు సెక్షన్ 6, 7, 18, 354, ఉచిత న్యాయ సహాయం, గౌరవ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబరు 15100, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, వన్‌స్టాప్ సెంటర్ విధులు, పారా లీగల్ వాలంటీర్లు విధులు, లీగల్ ఎయిడ్ క్లినిక్ విధులు, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కడప వారిని సంప్రదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వెల్ఫేర్ ఆఫ్ డిఫరెంట్లీ ఏబుల్ ట్రాంజెండర్స్ అండ్ సీనియర్ సిటిజన్స్ డిపార్ట్‌మెంట్ ఆర్.వి.కృష్ణ కిశోర్, అడిషనల్ డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ కడప, ఎస్.రవిబాబు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డీసీఆర్బీ కడప సయ్యద్ హాసన్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ భాస్కర్, దిశా సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ నస్రిన్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.మనోహర్, ట్రాంజెండర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సారిక, ఎన్జీవోలు, మరియు ట్రాన్స్ జెండర్లు పాల్గొన్నారు.

### జులైలో హార్సిలీహిల్స్‌లో

## ఏఐటీయుసి శిక్షణా తరగతులు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

హార్సిలీహిల్స్‌లో జులై 24, 25, 26వ తేదీల్లోమున్సిపల్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయుసి) రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో శిక్షణా తరగతులపై కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేయబడ్డ 500మంది మున్సిపల్ వర్కర్స్ ప్రతినిధులు ఈ శిక్షణా తరగతులకు హాజరు అవుతారన్నారు. కార్మిక చట్టాలపై అవగాహన కల్పించడం, భవిష్యత్తు ఉద్యమాలకు వేధిక అవుతాయన్నారు. అనుభవిజ్ఞులైన అధ్యాపకులచే శిక్షణ ఇవ్వబడుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ, మున్సిపల్ జిల్లా యూనియన్ ప్రధాన కార్యదర్శి వర్రి సురేష్‌కుమార్, నాయకులు ముభారక్, మస్తాన్, నాగరాజు, వృద్విరాజ్, వాసు, లోకేష్, ఓబులేసు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కిలో టమోటా రూ.62



ఆనందోత్సవాల్లో రైతులు

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

టమోటా ధరలు గత పది రోజులుగా గణనీయంగా పెరుగుతున్నాయి. మంగళవారం మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లె టమోటా మార్కెట్‌యార్డులో మొదటి రకం కిలో టమోటా రూ.62లు ధర పలికింది. మార్కెట్‌యార్డుకు 690మెట్రిక్ టన్నులు టమోటాలు వచ్చాయి. మొదటిరకం పదికేజీల టమోటాబాక్స్ రూ.580నుంచి 600ల వరకు ధరలు పలికాయి. బయట ప్రాంతాల్లో టమోటాకు డిమాండ్ ఉండడం వల్లే ధరలు పెరిగాయలని వ్యాపారస్తులు చెబుతున్నారు. టమోటా ఉత్పత్తి కూడా తక్కువుగా ఉండడం వల్లే ధరలు రోజు రోజుకు పెరుగుతున్నాయన్నారు. ఇన్నాళ్ళు ధరలు లేక నష్టాలు చవిచూసిన రైతాంగానికి ధరలు పెరగడంతో రైతులు లాభాల బాటలో పయనిస్తున్నారు. ఇవే ధరలు నెల రోజులు పాటు ఉంటే రైతులు అప్పుల బాద నుంచి గట్టు ఎక్కగలరని చెబుతున్నారు. రాష్ట్రంలోనే మదనపల్లె టమోటా మార్కెట్‌యార్డు వ్యాపార లావాదేవీలకు పేరు పొందింది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిస్సా, కర్నాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలతో పాటు ప్రధాన నగరాలకు ఎగుమతి చేస్తారు. టమోటా వ్యాపార లావాదేవీలతో మార్కెట్‌లో వేలాదిమంది కూలీలు జీవనం పొందుతున్నారు.

## సింగల్‌విండో పదవికి కేశవరెడ్డి రాజీనామా

రామసముద్రం, జూన్ 11 ప్రభాతవార్త :

మండల సహకార బ్యాంకు అధ్యక్షులుగా ఉన్న కేశవరెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. టిడిపి అధికారంలోకి రావడంతో తన పదవికి రాజీనామా లేఖను ఉన్నతాధికారులకు పంపారు. ఈ సందర్భంగా కేశవరెడ్డి మాట్లాడుతూ గత 12ఏళ్ళుగా సింగిల్‌విండో అధ్యక్షులునిగా పనిచేసిన తనకు సహకరించిన అధికారులకు, బోర్డు సభ్యులకు, రైతులకు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.

## చంద్రబాబు ప్రమాణస్వీకారానికి తరలిన టిడిపి నాయకులు

నిమ్మనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :

నిమ్మనపల్లె మండలంలోని పది గ్రామ పంచాయితీల్లోనూ భారీ సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు చేయబోయే ప్రమాణ స్వీకారానికి బయలుదేరి వెళ్ళారు. రెండు బస్సులు, దాదాపు 10జీపులు, కారుల్లో బయలుదేరి వెళ్ళారు.

# కారు-లారీ ఢీ

పోరుమామిళ్ల, జూన్ 11, ప్రభాతవార్త :



త్రిపురాంతకం మండలంలోని కేశినేని పల్లి జంక్షన్ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన కారు-లారీ ఢీకొన్న ఘటనలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ ఓబులేసు మృతి చెందారు. కాగా మృతుడు పోరుమామిళ్ల మండలంలోని సింగన పల్లికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. ఇతను ఒడిశాలో సీఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తూ సెలవుపై స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తెలుగుదేశం పార్టీ విజయం పట్ల హర్షం

పీలేరు, జూన్ 11ప్రభాతవార్తః

తెలుగుదేశం పార్టీ ,జనసేన, బీజేపీ మహాకూటమిలో భాగంగా రాష్ట్రంలో 164 శాసన సభ స్థానాలు గెలుపొంది రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రితో పాటు శాసన సభ్యులు ప్రమాణ స్వీకారం సందర్భంగా హర్షం వ్యక్తం చేసినట్లు పీలేరు నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ పోలిశెట్టి సురేంద్ర తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైఎస్సార్ ప్రభుత్వంలో తెదేపా అభిమానులను కార్యకర్తలను ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేయడం పట్ల ప్రజలు వైసీపీ ప్రభుత్వం పై విసుగుచెంది తెదేపా కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించడం రాష్ట్రాన్ని అభివద్ధి పథంలో పయనించడానికి శుభసూచకమని ఆయన అన్నారు.

## ఎఫ్‌పీఓ కోసం వెబ్‌సైట్స్ రూపకల్పన



పీలేరు, జూన్ 11 ప్రభాతవార్తః

రైతు ఉత్పత్తిదారుల సంఘం కోసం స్థానిక సీఎన్ఆర్ డిగ్రీ తతీయ ఏడాది విద్యార్థుల వెబ్‌సైట్స్ రూపకల్పన చేశారు. ఏపీ మాస్ ఆధ్వర్యంలో 2018 నుంచి పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంఘం నడుస్తోంది. ఈసంఘం ద్వారా పీలేరు, కేవీ.పల్లె మండలాలకు చెందిన రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇప్పటికే తమ ఉత్పత్తులను సంఘం ద్వారా విక్రయించుకుంటున్నారు. విక్రయాలలో మరింత అభివద్ధి సాధించేందుకు వాటికోసం ప్రత్యేక వెబ్‌సైట్స్ ఉంటే బాగుంటుందన్న ఆలోచనతో పీలేరుకు చెందిన ప్రకతి వ్యవసాయ నిపుణులు బోదేశావలి స్థానిక సీఎన్ఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ద్వారా వెబ్‌సైట్స్ తయారుచేయించారు. వెబ్‌సైట్ తయారీకి ప్రత్యేక నిపుణులు ఉన్నప్పటికి విద్యార్థులకు రైతు సాదక బాదలపై అవగాహన కల్పించాలన్న లక్ష్యంతో విద్యార్థులను ఎంచుకున్నారు. దీంతో సీఎన్ఆర్ డిగ్రీ కళాశాలల బీఎస్సీ, ఎంపీసీఎస్ తతీయ సంవత్సరం చదువుతున్న మహేష్, జయసింహ, గణేష్, హేమంత్, హరిప్రసాద్, వెంకటేష్, వెంకటేశ్వర అయాన్ జట్టుగా ఏర్పడి దాదాపు 20 రోజులు శ్రమించి పీలేరు ఎఫ్‌పీఓ డాట్ ఓఆర్జీ పేరుతో ప్రత్యేక వెబ్‌సైట్ తయారు చేశారు. తాము చేసిన వెబ్‌సైట్ విశేషాలు దానిని ఉపయోగించుకునే విధానం ఆన్‌లైన్‌లో క్రయ విక్రయాలు సాగించే విధానాలను మంగళవారం సీఎన్ఆర్ కళాశాలలో రైతులకు వివరించారు. పలువురు రైతులు మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటే లాభదాయక ఉపయోగాలు ఉంటాయన్న పలువురు అధికారులకు సూచనల మేరకు వెబ్‌సైట్ తయారీకి పూనుకున్నామని దానిలో తమకు సహకరించిన సీఎన్ఆర్ కళాశాల యాజమాన్యానికి కతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీ మాస్ డైరెక్టర్ వినాయక్‌రెడ్డి, ప్రాజెక్టు మేనేజరు డాక్టర్ భార్గవి, సీఈఓ ప్రత్యూష, డైరెక్టర్లు శ్రీనివాసులురెడ్డి, శ్రీదేవి, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్ పదవికి రాజీనామా

కడప కార్పొరేషన్, జూన్ 11, ప్రభాతవార్త:



ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్టీఎస్) డైరెక్టర్ పదవికి ఇలియాస్ బీహెచ్ రాజీనామా చేశారు. వైసీపీ కువైట్ కన్వీనర్‌గా గల్ఫ్ కన్వీనర్‌గా పని చేశారు. 2019 ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ గత 28 ఏళ్లుగా గల్ఫ్ సమస్యల కోసం పాటుపడినట్లు గుర్తు చేశారు. గత నాలుగేళ్ల నుంచి ఏపీఎన్ఆర్టీఎస్ డైరెక్టర్‌గా పని చేస్తూ గల్ఫ్ సమస్యలు పరిష్కరించినట్లు తెలిపారు. ఏపీ ఎన్ఆర్టీఎస్ ఛైర్మన్ రీజనల్ కోఆర్డినేటర్లు, ఉద్యోగుల సహకారంతో ప్రవాసాంధ్రుల సమస్యలను పరిష్కరించినట్లు గుర్తు చేశారు. రాష్ట్రానికి వచ్చిన 55 వేల మందికి ఉచితంగా అన్ని వసతులు జగన్ ప్రభుత్వం కల్పించిందన్నారు. వైకాపా ఎన్ఆర్ఐ గ్లోబల్ కన్వీనర్ మేడపాటి వెంకట్, గల్ఫ్ వైకాపా కన్వీనర్లు సభ్యులతో కలిసి గల్ఫ్ సమస్యలను పరిష్కరిస్తూ పార్టీ అభ్యున్నతికి పాటు పడతామని చెప్పారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీలు వైఎస్.అవినాష్‌రెడ్డి, పి.మిథున్‌రెడ్డిల సహకారంతో గల్ఫ్ సమస్యల కోసం పని చేస్తానని తెలిపారు.

### ఎస్సీ వర్గీకరణకు

## కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వాలి

కడప కార్పొరేషన్, జూన్ 11, ప్రభాతవార్త:

కేంద్రంలో కొలువు దీరిన నరేంద్ర మోదీ ప్రభుత్వం తక్షణమే ఎస్సీ వర్గీకరణ హామీని పార్లమెంటులో ఆమోదింప చేయాలని మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు పిచ్చుక బాబు, కార్యదర్శి ఎస్.వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్‌లు కోరారు. జులై 7న తెలంగాణలోని వరంగల్‌లో తలపెట్టిన మాదిగల ఆత్మగౌరవ కవాతు కార్యక్రమానికి జిల్లాలోని మాదిగలు రావాలని పిలుపునిచ్చారు. దేశ ప్రధాని మోదీ, నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం సందర్భంగా వారికి శుభాభినందనలు తెలిపారు. మంగళవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ కోసం మాదిగల అలుపెరగని పోరాటం చేస్తున్నారన్నారు. మూడో సారి అధికారంలోకి వచ్చిన తక్షణమే ఎస్సీ వర్గీకరణ చేపడతానని మోదీ ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో తెలంగాణలో ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చాల్సిందిగా దేశ ప్రధానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ గౌరవ సలహాదారులు సీవీ రమణ, గౌరవ అధ్యక్షుడు గొల్లపల్లె భాస్కరరావు, జోనస్, గురయ్య, బాలజోజి, హరినాథ్ పాల్గొన్నారు.



# పార్టీకి పూర్వవైభవం తెండి

రైల్వేకోడూరు, జూన్ 11, ప్రభాతవార్త:



గత 25 సంవత్సరాలకు ముందు రైల్వే కోడూరు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న రైల్వేకోడూరు నియోజకవర్గం పూర్తి స్థాయిలో 2004 నుండి 2014 వరకు వైసిపి కంచుకోటగా తయారైన సందర్భంలో మూడు నెలల క్రితం అప్పటి ప్రతిపక్ష నేత, ప్రస్తుత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నియోజకవర్గ బాధ్యతలు చేపట్టిన, ముక్కా రూపానందరెడ్డికి బాధ్యతలు మూడు నెలల్లోనే కూటమి అభ్యర్థిని నిలబెట్టుకుని విజయవంతంగా వైసీపీ పార్టీని చిత్తు చిత్తుగా ఓడించి ఉమ్మడి అభ్యర్థి శ్రీధర్ ను గెలిపించిన ముక్క రూపానందరెడ్డిని సోమవారం కేంద్ర తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఘనంగా ముక్క కుటుంబాన్ని అభినందించారు. ఈ సందర్భంగా ఉమ్మడి అభ్యర్థి నీ గెలిపించుకుని మొదటిసారిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్దకు వెళ్లి శుభాకాంక్షలు రూపానందరెడ్డిని చూడగానే, అభ్యర్థిని గెలిపించుకొని నీవే రైల్వేకోడూరు కింగ్ అని చెప్పిన అభ్యర్థిని గెలిపించుకొని శహబాష్ అనిపించుకున్నారని ఆయన రూపానందరెడ్డిని ప్రశంసించారు. ముఖ్యంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలలో అనతి కాలములోని రైల్వేకోడూరు ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టి ఒక్కసారిగా తిరుగులేని విజయాన్ని సాధించిన వీరుడువని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ముఖ్యంగా ఇదే కోవలో రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని తెలుగుదేశం పార్టీ కంచు కోటగా విజయ పదాన పార్టీని క్యాదర్ను బలోపేతం చేయాలని రూపానందరెడ్డికి సూచించారు. ఎర్రటి ఎండను సైతం లెక్క చేయకుండా పూర్తి స్థాయిలో ముక్కా రూపానందరెడ్డి కుటుంబం ఎన్నికలలో ఐదు మండలాలలో పార్టీని గెలిపించాలని ఉద్దేశంతో నిరంతరం శ్రమించారని చంద్రబాబు కితాబు నిచ్చారు. ముఖ్యంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఎన్నికలలో పనిచేసి విజయాన్ని తొలిమెట్టుగా స్వీకరించి అభ్యర్థిని గెలిపించి విజయ పదాన నడవాలని చంద్రబాబు నాయుడు పేర్కొన్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో కార్యకర్తలను, ఉమ్మడి పార్టీ క్యాదర్ను కూడా కలుపుకొని రానున్న రోజుల్లో పూర్తి స్థాయిలో పార్టీని నడిపించాలని రూపానందరెడ్డికి సూచించారు. అనంతరం చంద్రబాబు నాయుడుకు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రూపానందరెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి, తనయుడు రాష్ట్ర తెలుగు యువత నాయకులు సాయి వికాస్ రెడ్డితో పాటు నియోజకవర్గానికి చెందిన ఐదు మండలాల టిడిపి జనసేన పార్టీ నాయకులు, మంగంపేట అధినేత తల్లెం రమణారెడ్డి, మంగంపేట రమణ, వాల్మీకి సంఘం నాయకులు, ఓబులవారిపల్లె మాజీ మండల అధనయక్ష:ఉలు గంగరాజు వేంకటేశ్వరరాజు. మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రవికుమార్ రాజు, కార్యకర్తలు పాల్గొని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను ఘనంగా సన్మానించినట్లు, రూపానందరెడ్డి తెలిపారు.

# మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు

కేవి.పల్లె, జూన్ 11 ప్రభాతవార్తః



మండలంలోని గర్నిమిట్ట పీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మా ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను ఆరోగ్య సిబ్బంది మంగళవారం గర్నిమిట్ట గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ రేష్మా మాట్లాడుతూ మలేరియా సోకిన వ్యక్తి సకాలంలో చికిత్స పొందకపోతే ప్రాణాంతకమవుతుంది కావున చలితో కూడిన జ్వరం, చెమట పట్టడం, తల నొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపునొప్పి, వాంతులు, వికారం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. మలేరియాను నిర్మూలించాలంటే సమాజంలోని ప్రతి ఒక్కరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అపరిశుభ్రమైన పరిసరాలు నీటి నిల్వలలో దోమలు వద్ధి చెంది మలేరియా వ్యాప్తికి దోహదపడుతుందన్నారు. దోమకాటు నుంచి రక్షణకై దోమతెరలు వాడాలన్నారు. మలేరియా జ్వరానికి పూర్తిస్థాయిలో ఉచిత చికిత్స ప్రభుత్వ ఆసుపత్రులలో లభిస్తుందని తెలిపారు. సీజినల్ వ్యాధులగు నీళ్ల విరేచనాలు, అతిసారా, టైఫాయిడ్, డెంగ్యూజ్వరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మాతశిశు సంరక్షణ సేవలు ప్రగతిని సమీక్షించారు. వయోజన బీసీజీ టీకాలను ఇంకా చాలామందికి వేయాల్సిన అవసరాన్ని వివరించారు. ఈకార్యక్రంలో వైద్యురాలు అర్చన, భాగ్యలక్ష్మి, రమాదేవి రుక్మిణి, పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశా డే కార్యక్రమం



ఖాజీపేట, జూన్ 11, ప్రభాతవార్త:

ఖాజీపేటలో మంగళవారం రోజు ఆశా డే మీటింగ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ముబీన్, డాక్టర్ ఆయేషా సుల్తాన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఓఆర్ఎస్ ఎలా వాడాలి, హ్యాండ్ వాషింగ్, శానిటేషన్ మరియు డ్రింకింగ్ వాటర్ గురించి తెలియజేశారు. అలాగే కొత్త దంపతులకు కుటుంబ నియంత్రణ, తాత్కాలిక పద్ధతులు గురించి అవగాహణ కార్యక్రమాలు మరియు ప్రెగ్నెంట్ ఉమెన్, ఆర్లీ రిజిస్ట్రేషన్ మరియు ఇన్సిట్యూషనల్ డెలివరి గురించి ఇంప్రూవ్‌మెంట్ కావాలని అలాగే ఏఎన్‌సీ చెకప్, ఈ-ఆశా యాప్ అప్డేషన్ గురించి, కిల్కరి కాల్స్ వారికి తెలియజేశారు. అలాగే లెప్రసీ. మలేరియా దోమల ద్వారా వ్యాపించే వ్యాధ/లు గురించి వారికి తెలియజేశారు. సమాజంలో ఆడపిల్ల ఆవశ్యకత గురించి భ్రూణహత్యలు చేయడము ప్రజలకు చట్టం గురించి అవగాహణ కల్గించి ఆడ పిల్లల శాతం పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి బి.నాగభూషణం, ఆశ నోడల్ ఆఫీసర్ ఈ.అరుణకుమారి, సూపర్‌వైజర్ ఏ.శోభన్‌బాబు, బి.కృష్ణప్రియ, ఫార్మసీ ఆఫీసర్ వి.కేశవయ్య, స్టాఫ్‌నర్స్ ఏ.సుప్రజ, లావణ్య, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రమాణస్వీకారానికి తరలివెళ్లిన తెదేపా నాయకులు

పెండ్లిమర్రి, జూన్ 11, ప్రభాతవార్త:

మండలంలోని పలు గ్రామాల నుంచి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారానికి తెదేపా నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. అలాగే మండల కమిటీ అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హర్షధ్వానాల మధ్య బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా వారు తమ నాయకుడు సీఎంగా ప్రమాణ స్వీకారం చేయడం సంతోషంగా ఉందని రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని ఆయన సేవలను కొనియాడారు.

## ప్రైవేట్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త:

ప్రైవేటు టీచర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ యూనియన్(పీటీఎల్‌యూ) రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దాదాపు 5లక్షల మంది ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్స్ ఎటువంటి హక్కులు లేకుండా బానిసత్వపు బ్రతుకులతో ఉన్నారని అన్నారు. రాష్ట్రాభివిద్యాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్న వారు ప్రైవేటు టీచర్లు అన్నారు. గత ప్రభుత్వం ప్రైవేటు టీచర్లు, లెక్చరర్స్ యొక్క జీవితాలను మారుస్తామని చెప్పి మ్యానిఫెస్టో చెప్పారన్నారు. ఏపీ ఎన్డీఏ కూటమిలో ప్రభుత్వం సారధ్యంలో ప్రైవేటు టీచర్ల సంక్షేమం, హక్కుల కొరకు పాటుపడాలని, కృషి చేయాలని తెలిపారు. కొత్తగా ఏర్పాటు అయ్యే కూటమి ప్రభుత్వానికి ప్రైవేటు టీచర్లు, లెక్చరర్స్ యూనియన్ తమ శుభాకాంక్షలు తెలిపారు.

### పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టించిన రామోజీరావు

కడప వైద్యవిభాగం, జూన్ 11, ప్రభాతవార్త:



ఈనాడు పత్రికాధిపతి రామోజీ గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు మృతి తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని సామాన్య కుటుంబంలో పుట్టి స్వయం కృషితో కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన వ్యక్తి రామోజీరావని జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ ఏపీ (జాప్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని జాప్ కార్యాలయంలో జర్నలిస్టులు రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు రామోజీరావు కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మాదాల వెంకటేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మామిళ్ల యల్లారెడ్డి, సూర్య బ్రాంచ్ మేనేజర్ నాగరాజు, జిల్లా బ్యూరో రంగయ్య, ఎన్‌యూజేఐ మాజీ సభ్యులు జ్యోతి జార్జి, సి.కె.దిన్నె రిపోర్టర్ సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## మలేరియా నివారణపై ర్యాలీ

దువ్వూరు, జూన్ 11, ప్రభాతవార్త:

మండల కేంద్రమైన దువ్వూరులో స్థానిక ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది, వైద్యులు కలిసి మలేరియా వ్యాధి నివారణకు గానూ ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా వైద్యాధికారులు డాక్టర్ సురేష్ బాబు, వికసిత, హేమలతలు మాట్లాడుతూ మలేరియా వ్యతిరేక మాసోత్సవం సంధర్భంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 1వ తేది నుండి 30 వరకు మలేరియా మాసోత్సవాన్ని నిర్వహిస్తున్నామని ఇందులో ప్రజలకు అవగాహణ కల్పిస్తున్నామన్నారు. మలేరియా రాకుండా పలు జాగ్రత్తలు పాటించాలని ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకండా చూడాలని, దోమతెరలు వాడి దోమల బారి నుండి కాపాడుకోవాలన్నారు. అలాగే సబ్‌యూనిట్ ఆఫీసర్ నరిసంహారెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్త ఆరోగ్య సమతుల్య సాధణకై మలేరియా వ్యతిరేక పోరాటాన్ని వేగవంతం చేయాలన్నారు. గ్రామాలలో దోమలు పుట్టకుండా, కుట్టకుండా అనే నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ ర్యాలీలో వైద్య సిబ్బంది సువర్ణ, శాంతకుమారి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



### యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ రాజీనామా

ముద్దనూరు, జూన్ 11, ప్రభాతవార్త:



యర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్మెన్ ఉమాదేవి రాజీనామా చేశారు. తన రాజీనామ పత్రాన్ని అధికారులకు అందజేశారు. ముద్దనూరు వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీకి చెందిన ఉమాదేవి 30.09.2022లో మార్కెట్ యార్డ్ అధ్యక్షులుగా నియమించింది. ఇటివల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వైఎస్సార్ కాంగ్రేస్ పార్టీకి అనుకూలమైన ఫలితాలు రానందున నైతిన బాధ్యత వహిస్తూ మంగళవారం రాజీనామా చేశారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరి ప్రోద్భలం లేకుండా స్వతంత్రంగా రాజీనామా పత్రాన్ని సమర్పించానని, తన రాజీనామాను ఆమోదించాలని కోరారు. ఇంతవరకు తనకు సహకరించిన అధికారులకు మరియు రాజకీయ నాయకులకు, మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు.

### ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కలిసిన మండల నాయకులు

ఖాజీపేట, జూన్ 11, ప్రభాతవార్త:

బుధవారం తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా విజయవాడలోని లెమన్ ట్రీ హోటల్‌లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను రావులపల్లె టీడీపీ నేత గంగవరం ఆదినారాయణ రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసిన తెలుగుదేశం పార్టీ మండల నాయకులు. ఈ కార్యక్రమంలో గంగవరం ఆదినారాయణ రెడ్డి(బాబు), ఐ టిడిపి మండల అధ్యక్షుడు పాపన మల్లికార్జున రెడ్డి, కొత్తపేట బుజ్జిరెడ్డి, బొర్రా శివరామిరెడ్డి, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



### ఏపి ఈఏపిసెట్‌లో మదనపల్లె విద్యార్థినికి 5వ ర్యాంకు

మదనపల్లెక్రైం, జూన్ 11 ప్రభాతవార్త :



ఏపి ఈఏపిసెట్‌లో మదనపల్లె విద్యార్థిని 5వ ర్యాంకు సాధించింది. మదనపల్లె పట్టణంకు చెందిన హోమియోపతి వైద్యులు శ్రీకర్, కళ్యాణ్ దంపతుల కుమార్తె ప్రణీత ఏపి ఈఏపిసెట్‌లో అగ్రికల్చర్-ఫార్మసీ విభాగంలో 5వ ర్యాంకు సాధించింది. ప్రణీత ఇటీవల విడుదలైన తెలంగాణ సెట్‌లో కూడా మొదటిర్యాంకు సాధించింది. అలాగే నీట్‌లో 720కి 710 మార్కులు సాధించి ప్రతిభచాటడం జరిగింది. ప్రణీత ఇంతటి ప్రతిభ చాటడం పట్ల పట్టణ ప్రజలు, ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## ఉప విద్యాశాఖాదికారి ఆకస్మిక తనికీ



కేవి.పల్లె, జూన్ 11 ప్రభాతవార్తః

తిరుపతి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి బాలాజీ మండలంలోని గర్నిమిట్టలోని పార్థ ప్రయివేటు స్కూల్‌ను మంగళవారం ఆకస్మికంగా తనికీచేశారు. ఈ సందర్భంగా రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. తరగతి గదులలో వసతులు పరిశీలించి పాఠశాల యాజమాన్యానికి ప్రన్సిపాల్‌లకు పలు సూచనలు జారీ చేశారు. అనంతరం మండల విద్యాశాఖ కార్యాలయాన్ని సందర్శించి మండల విద్యాశాకాధికారులకు, సీఆర్‌పీలకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. జూన్ 13 నుంచి పాఠశాలలు పున: ప్రారంభం అవుతున్నాయి కావున అన్ని పాఠశాలలు పరిశుభ్రంగా ఉంచుకునేలా హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. పాఠ్యపుస్తకాలు, విద్యార్థులకు అందించే కిట్లు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే అందజేసే విధంగా సిద్దంగా ఉండాలని తెలియజేశారు. మిషన్ లైఫ్ కార్యక్రమాలు షెడ్యూల్ ప్రకారం అన్ని పాఠశాలల్లో హెచ్‌ఎంలు చూడాలని తెలియజేశారు. ఉప విద్యాశాఖాధికారి వెంట కేవి.పల్లె ఎంఈఓ రెడ్డిబాషా, సుబ్రమణ్యంరెడ్డి, క్లస్టర్ హెచ్‌ఎం వెంకటరమణ ఉప విద్యాశాఖాధికారి కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకులకు గాయాలు

పోరుమామిళ్ల, జూన్ 11, ప్రభాతవార్త :

పోరుమామిళ్ల మండలం టేకూరు పేటకు చెందిన నారాయణ, నరసింహులు అనే వ్యక్తులు తమ స్వంత పనులపై బ్రహ్మంగారిమఠంకు వెళ్లారు. మఠం మండలం లింగాలదిన్నె బ్రిడ్జి వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీ కొనడంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్స నిమిత్తమై ప్రభుత్వఆసుపత్రికి తరలించారు.

### ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి వెళ్లిన తెదేపా శ్రేణులు

పీలేరు, జూన్ 11 ప్రభాతవార్తః

విజయవాడలో బుధవారం జరగనున్న రాష్ట్ర మంత్రివర్గ ప్రమాణ స్వీకారమహోత్సవ కార్యక్రమానికి వెళ్లిన తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి ని పీలేరు మండలంలోని ముడుపులవేముల గ్రామ తెదేపా శ్రేణులు విజయవాడలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో తన ప్రత్యర్థి చింతల రామచంద్రారెడ్డిపై 25వేలకు పైగా మెజారిటీ సాధించి తిరుగులేని నాయకుడిగా ప్రభంజనం సష్టించిన నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డికి మంత్రి పదవి వరించాలని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అప్పస్వామి, చంద్రయ్య, ఆదినారాయణ, సురేంద్ర, భాను, కిషోర్, మునిరత్న, కాటంరాజు పాల్గొన్నారు.

## ఎంసెట్ ఫలితాలలో బీజేఎస్ఆర్ ,సుభాష్ గాయత్రి కళాశాలల విద్యార్థుల ప్రతిభ



బద్వేలు అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త :

రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం వెలువడిన ఎంసెట్ ఫలితాలలో బద్వేలు పట్టణం బీజేఎస్ఆర్ కళాశాల, గాయత్రి సంయుక్త కళాశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచినట్లు కళాశాలల యాజమాన్యం తెలిపింది. ఇందులో భాగంగా ఇంజనీరింగ్ విభాగంలో 9367. పి.లక్ష్మి11537, వై.చక్రవర్తి12021, కె. కృష్ణ కార్తిక్ 15695, జి. సుప్రజశ్రీ 15736, ఎల్.సునీత 16481, సి.భవిత 18617, కె.మంజుశ్రీ 20055, టి. భాను శివారెడ్డి 21660, ఎ.నవిత 22713, పి. సాయి విష్ణువర్దన్‌రెడ్డి 23674, పి. మనోజ్ 24494, ఆర్.పీరాన్ బాష 24586 ర్యాంకులు సాధించి కళాశాలను అగ్రగ్రామిగా నిలిపినట్లు బీజేఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ వీరశేఖర్‌రెడ్డి, సుభాష్ గాయత్రి కళాశాల ప్రిన్సిపాల్ సుబ్బరాయుడులు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులై శివశంకర్‌రెడ్డి, గురవయ్య, సుదర్శన్‌రెడ్డి, వినోద్, జయపాల్, పోలిరెడ్డి, నరసింహ, మస్తాన్‌రెడ్డి, సురేష్‌బాబు, రామక్రిష్ణ, జాకీర్‌హుస్సేన్, రాయుడు, సురేష్ తదితరులను ప్రిన్సిపాల్‌లు అభినందినందించారు.

### నేడు బద్వేలులో డయల్ యువర్ డిఎం

బద్వేలు అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త :

బద్వేలులో బుధవారం డయల్ యువర్ డిఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలనుంచి 12 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని, కావున ప్రయాణీకులు తమకు ఏవైనా ఇబ్బందులున్నా, ఆర్టీసీ తీసుకోవాల్సిన చర్యలు ఏవైనా ఉన్నా తమకు తెలియజేవచ్చన్నారు. ఇందుకు 9959255779 నంబరుకు ఫోన్ చేయాలని లేదా వాట్సాప్ మెసేజ్ అయినా చేయవచ్చన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ నా కూతురు పేరు దూదిమని భావన శృతి మునపటి పాస్పోర్ట్ లో భావన శృతి వుంది ఇంటి పేరును జోడించలేదు, కావున ఇప్పుడు పాస్పోర్ట్ లో ఇంటి పేరును జోడించాలని అనుకుంటున్నాను. (తండ్రి) (Ro.No.10496)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.




# ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



**ముద్దనూరు, జూన్ 11, ప్రభాతవార్త:**
ముద్దనూరు మండలంలోని పెద్ద దుద్యాల గ్రామ సమీపంలో కెమికల్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు కెమికల్ ఫ్యాక్టరీ నుండి ముద్దనూరుకు వచ్చి సొంత పనుల నిమిత్తం మంగళవారం రాత్రి తిరుగు ప్రయాణం వెలుతుండగా కొట్టాల్‌పల్లె డాబా సమీపంలో గుర్తు తెలియని వాహణం ఢీ కొంది. ఈ ప్రమాదంలో సాయి అనే 18సంవత్సరాల యువకుడు మరియు తౌఫిక్ అనే 20సంవత్సరాల యువకునికి తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. గుర్తు తెలియని వాహణం ఢీ కొందని స్ధానికులు తెలిపారు. వెంటనే గ్రామస్థులు 108కు సమాచారం ఇవ్వగా ఘటనా స్ధలానికి చేరుకొని 108 సిబ్బంది ప్రథమచికిత్సనిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.




























## పలు కేసుల్లో ముద్దాయి అరెస్టు

**వేంపల్లె, జూన్ 11, ప్రభాతవార్త ః**
వేంపల్లె పట్టణంలోని పలు ప్రాంతాల్లో జరిగిన చోరీ కేసుల్లో ముద్దాయి శివకుమారా్‌ను అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం వేంపల్లె పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరి 23న పట్టణ శివారులోని హనుమాన్ జంక్షన్ వద్ద స్టార్ సిటీ బైకును శివకుమార్‌తో పాటు చిన్నా అనే వ్యక్తి కలిసి చోరీ చేశారన్నారు. అనంతరం అక్కడ నుండి టీచర్ల కాలనీలో ఉన్న రామాలయం దగ్గరకు వెళ్లి బీగం పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారన్నారు. అక్కడ ఉన్న రాముడు, సీత, లక్ష్మణ, విగ్నేశ్వరుని వెండి కిరీటీలు, అభయహస్తం, సీతమ్మ మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని దొంగలించారని తెలిపారు. ఇడుపులపాయ అటవీ ప్రాంతంలోకి వెళ్లి బంగారు, వెండి వస్తువులను దాచిపెట్టారని తెలిపారు. పీలేరులో ఓ వ్యక్తికి సీతమ్మ బంగారు తాళిబొట్టును అమ్మి రూ.10వేలు తీసుకుని జల్సా చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో దాచిపెట్టిన బంగారు, వెండి వస్తువులను తీసుకు వచ్చే క్రమంలో వీరన్నగట్టుపల్లె క్రాస్ వద్ద పోలీసులు శివకుమార్‌ను పట్టుకుని అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. ఇతను దొంగలించిన ఆభరణాల విలువ రూ.2.30లక్షలు ఉంటుందని డీఎస్పీ తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ మధుసూధన్‌వర్మ, కానిస్టేబుల్ మహేష్‌లను డీఎస్పీ వినోద్‌కుమార్‌తో పాటు సీఐ చాంద్‌బాషా అభినందించారు.




